
ఆంధ్రభూమి వారపత్రిక కథల పోటీలో బహుమతి పొందిన కథ

# అనకొండ



**చ**లి శివ శివ అంటూ వెళ్ళిపోయింది.

ఉత్సాహంగా నిద్రలేచి ముఖం కడుక్కుని ఉదయపు నడకకు బయల్దేరాను.

"పాల పేకెట్టు తేవటం మర్చిపోకండి" రోజూ అది మా ఇల్లాలి మొదటి డైలాగ్.

"మరచిపోన్లేవే. నా పేపర్ కోసమైనా అతగాడి దగ్గరి కెళ్ళాలిగా" నాదీ రొటీన్ డైలాగే.

మా అపార్ట్‌మెంటు నాలుగో అంతస్తు నుంచి లిఫ్టులో క్రిందికి దిగి వచ్చాను. నైట్ వాచ్‌మెన్ ఆవులిస్తూ 'సలాం' చేశాడు. "రాత్రి నిద్ర పట్టలేదా?" నవ్వుతూ చురకవేసి గేటు దాటాను.

రోడ్డు కవతలి ప్రక్కనున్న పెద్ద చెట్టుకింద కొబ్బరి బొండాలు అన్‌లోడ్ చేస్తున్నారు.

అక్కడ బొండాల దుకాణం వెలియ బోతున్నదని అర్థమైంది. చాలా సంతోషం వేసింది. ఇక బొండాం కోసం అర కిలోమీటరు  దూరం వెళ్ళి రానక్కర్లేదు. మా బాల్కనీ లోంచి ఓ కేక వేస్తే చాలు ఇంటికే తెచ్చిస్తాడు.

దగ్గరుండి బొండాలు దింపిస్తున్న పెద్దాయన వంక కించిత్తు అభిమానంగా చూసి ముందుకి సాగిపోయాను.

గ్రౌండ్‌లో నాలుగు రౌండ్లేసి, నడక మిత్రులతో కబుర్లాడి, దారిలో పాలూ పేపరూ తీసుకుని ఇంటిముఖం పట్టాను.

కొబ్బరి బొండాలతను బొండాలని శ్రద్ధగా సర్దుతున్నాడు. అతగాడి కథా కమామిషూ తెలుసుకోవాలని అటు అడుగు లేశాను.

"ఏమోయ్ నీ పేరేంటి?"

"సుబ్బయ్య అంటారండి. బొండం కొట్టనాండి..."

"ఇంత పొద్దున్నే ఎవడు తాగుతాడోయ్. మధ్యాహ్నం వస్తాలే. బొండాలు ఫ్రెష్‌గా ఉన్నాయ్. రోజూ ఇలాంటివే తెప్పించి, మిగతా వాళ్ళకన్నా రెండ్రూపాయలు తగ్గించి అమ్మావంటే చులాగ్గా రోజుకి రెండొందలు అమ్మేస్తావు. చూస్తున్నావుగా ఎటు చూసినా అపార్టుమెంట్లే. పైగా ఇది బిజీ సెంటర్. చూస్తూండు నెల తిరిగే సరికల్లా బైక్ మీద ఝూమ్మంటూ తిరుగుతావు"

"తవఁరి నోటి సలవన రెండు వేళ్ళు నోట్లో కెళ్తే శాన...!"

అతడి వంక కళ్ళెగరేసి చూశాను. "ఏ ఊర్నించి వలస వచ్చావేంటి"

"మాది గోదారి జిల్లా అండి. నిన్న మొన్నటి దాకా రైతునేనండి. అప్పులపాలై ఉన్న రెండెకరాలూ అమ్మేశాను. ఒంటి మీది బట్టలు తప్ప ఏం మిగల్లేదండి. పొట్ట చేత బట్టుకుని వచ్చేవండి. గుప్పెడు నూకలు దొరికితే చాలండి" కళ్ళొత్తుకున్నాడు.

"నువ్వేం దిగులు పడకు. ఈ సిటీలో నీలాగ వచ్చిన వాళ్ళు లక్షల్లో ఉంటారు. అంతా ఇళ్ళు కొనుక్కుని హ్యాపీగా ఉన్నారు"

"ఇక్కడంతా కూల్డ్రింకులు తాగతారంట కదండీ, వీటికి గిరాకీ ఉంటాదంటారా?" సందేహిస్తూనే అడిగాడు.

"భేషుగ్గా ఉంటుంది. నా మట్టుకు నేను రోజుకి రెండు బొండాలు కొంటాను.కొబ్బరి నీళ్ళు గ్లూకోజ్‌తో సమానమోయ్. కొబ్బరి బొండంలో సురక్షితంగా స్వచ్ఛంగా ఉండే కొబ్బరి నీళ్ళ ముందు కూల్డ్రింకులు బలాదూర్. అదీగాక వాటిల్లో ఏవో పురుగు మందులు కలుపుతున్నారని ఆ మధ్య ఋజువయ్యిందిలే. దాంతో వాటిని తాగేవాళ్ళ సంఖ్య ఇప్పుడు బాగా తగ్గిపోయింది"

అతడి కళ్ళు మెరిశాయి.

"పొట్ట చేత పట్టుకుని వచ్చాం. ఏదోలా బతికితే శాన!"

"ఏదోలా కాదు మహారాజులా బతుకుతావు. నీదింక శుక్రమహార్దశే. నీకూ నీ వ్యాపారానికీ తిరుగుండదు..." ఉబ్బేశాను. అతడ్ని మంచి చేసుకుంటే బొండాలు తక్కువ రేటుకి ఇస్తాడనీ, లేలేతవీ నీళ్ళెక్కువగా ఉన్నవీ ఇస్తాడనీ నా దూరాలోచన!

పైపంచెతో కళ్ళు తుడుచుకున్నాడు. రైతుగా తను పడ్డ కష్టాలు, ఎదురొచ్చిన నష్టాలూ గుర్తొచ్చాయేమో!

మధ్యాహ్నం బొండాలకోసం వెళ్ళేను.

"ఏమోయ్ సుబ్బయ్యా. ఎలా ఉంది వ్యాపారం?"

"తవంరి దయవల్ల బాగానే ఉందండి. బొండం చెక్కనాండి?"

"ఎలా ఇస్తున్నావేంటి?"

"ఇరవయ్యండి"

"అదేంటోయ్. ఆపై సెంటర్లో పదిహేనుకే ఇస్తున్నారు" అబద్ధమాడేను.

"అలా ఎలాగిస్తారండి. నాకే పదారు్రూపాయలు పడుతోందండి. కాయలు తెచ్చినందుకూ, తాగేసిన కాయలు తీసుకెళ్ళి పారేయడానికీ రెండ్రూపాయలు పుచ్చుకుంటున్నారండి. ఇంక నాకు మిగిలేది కాయకి రెండేనండి"

"నాకా లెక్కలు తెలీవు. అక్కడున్న రేటు చెబుతున్నాను. అదీగాక మనం ఎదురెదురుగా ఉంటున్న వాళ్ళం. పొద్దుట చెప్పాను నువ్వు మర్చి పోయావేమో. అదిగా ఆ బిల్డింగులోని అపార్టుమెంట్లోనే ఉంటున్నాం. నాకు స్పెషల్‌గా ఒక రూపాయి తగ్గించు. నేను డైలీ వచ్చే కస్టమర్ని..."

తలగోక్కున్నాడు. "కిట్టదండి..."

"అదే కిడుతుంది లేవోయ్. మంచివి బాగా నీళ్ళున్నవి చూసి రెండు చెక్కి ఇయ్యి..." చొరవ తీసుకున్నాను.

"ఈ పాలికి ఇస్తాను గాని రేపటాల్నుంచి ఇబ్బంది పెట్టమాకండి. నన్ను బతకనీండి..." చేతులు జోడించాడు.

"సరే సరే. బతికి చెడ్డవాడినంటున్నావు గనుక అలాగే ఇస్తాన్లే గాని ఒకటో రకం బొండాలివ్వాలి సుమా..."

"ఒకే చెట్టు కాయలైనా ఒకే తీరుగా ఉండవండి..." అంటూ ఒక్కో కాయనీ చేతుల్లోకి తీసుకుని పరీక్షించాడు. రెండు కాయల్ని ఎన్నిక చేసి, చెక్కి, పట్టుకోడానికి వీలుగా రెంటికీ బంధం వేసి అందిచ్చాడు.

నేనూ మా ఆవిడా కొబ్బరినీళ్ళు తాగాం.

"నీళ్ళు ఎక్కువగా ఉన్నాయి. రుచిగా ఉన్నాయి..." సంతోషంగా అంది ఇల్లాలు.

"కొత్త షాపులే. మన అపార్ట్‌మెంటు ఎదురుగా ఉన్న చెట్టుకింద పెట్టాడు. మనకోసం పాపం ఏరి ఏరి ఇచ్చాడు..."

"అలాగా. అయితే మీరింక ఎక్కడికో నడిచి వెళ్ళి తేనక్కర్లేదు..."

అవునంటూ తలాడించాను.

సుబ్బయ్యకి రెగ్యులర్ కస్టమర్నయ్యాను. నన్ను చూచి లేచి తను కూర్చున్న స్టూలు నాకిస్తాడు. దానిమీద కూర్చుని, పది నిమిషాలు పిచ్చాపాటీ మాట్లాడి, బొండాలు తీసుకుని వచ్చేయడం నా దినచర్య అయిపోయింది.

వేసవి వెళ్తోంది.

"ఈ సీజన్ బాగానే లాభించినట్టుంది..." సుబ్బయ్యతో అన్నాను.

"మీ దయవల్ల లోటు లేకుండా గడిచిపోతోందండి..."

"సంతోషం. మరి వచ్చే నెల నుంచి వర్షాలు మొదలవుతాయి కదా. ఇంకో వ్యాపారానికి మారతావా?"

"ఇంకోటేదీ చాతకాదండి. మావోళ్ళు ఫరవాలేదు అంటన్నారండి. బేరాలు తగ్గుతాయి గాని రోజులు గడిచిపోతాయంటున్నారండి. అదిగో ఆపై రోడ్లో ఆసుపత్రి ఉంది కదండి. రోగుల కోసం కొబ్బరి నీళ్ళు సీసాల్లో పట్టుకెళ్తున్నారండి..."

"మరింకేం, నక్కతోక తొక్కావన్న మాట...!"

ఎందుకో అతడి కళ్ళల్లోకి నీళ్ళొచ్చాయి. నాక్కన్పించకుండా ముఖం తిప్పుకుని పైపంచెతో తుడుచుకున్నాడు.

"ఏమోయ్ ఏవయ్యిందీ..."

"తిండి గింజలు పండించేవోణ్ణి. తిండికి వెదుక్కోవలసి వస్తోంది చూడండి. ఎండనక వాననక పొలంలో దిగి పనిచేసేవోణ్ణి. తలకి పైపంచె చుట్టుకుని 'వ్యవసాయదారులవండి' అని గొప్పగా చెప్పుకునే వాణ్ణి. ఇప్పుడిదిగో ఇలా అయిపోయింది బతుకు. రోడ్డు పక్కన చెట్టుకింద నిలబడి బొండాలమ్ముకోవాల్సిన కర్మ వచ్చిపడింది...!"

జాలిగా చూశాను. "మీ పొలం గట్ల మీద కొబ్బరి చెట్లుండేవేమో?" మాట మార్చడానికి అడిగాను.

అతడికి ఎక్కడలేని ఉత్సాహమూ వచ్చేసింది.

"ఆయ్! మొత్తం 21 చెట్లున్నాయండి. వేసంగిలో అయితే కాపు బాగా దిగేదండి. చెట్టు పాడవుతాయని బొండాలు తీసేవాళ్ళం కాదు. బాగా తయారైన కాయల్నే దించి అమ్మే వాళ్ళం. కాయలకన్నా బొండాలకి గిరాకీ పెరగటంతో ఇష్టం లేకపోయినా బొండాలనే అమ్మేం..."

"ఎంత రేటు ఇచ్చే వారేంటి?"

"కాయకి మూడో నాలుగో, అంతేనండి..."

"రైతుకి నాలుగు రూపాయలే దక్కుతున్నాయి. కస్టమర్‌కి ఇరవైకి అమ్ముతున్నారు. నీకేమో రెండ్రూపాయలే మిగుల్తున్నాయి. ట్రాన్సుపోర్టుకో నాలుగుపోయినా మధ్య దళారులకి పది రూపాయలు మిగుల్తున్నాయి. దారుణమే సుమా!"

"ఇదేకాదండి. అన్నీ ఇలాగే ఉన్నాయి. బజార్లో కిలో నలభై రూపాయలు పెట్టి బియ్యం కొనుక్కుంటూ ఉంటే తెలుస్తోందండి. మేం పండించిన ధాన్యం రైసు మిల్లోళ్లు ఎంత చవగ్గా కొనేసుకునే వారో తలచుకుంటే కడుపు తరుక్కు పోతాందండి..."

"నిజమే. ఉత్పత్తి దారులకీ వినియోగదారులకీ మధ్య పెద్ద అగాథం ఉంది. దాన్ని పూడ్చడానికి ప్రభుత్వం గట్టిగా పూనుకుంటే బావుణ్ణు"

"అబ్బే. రైతంటే అందరికీ చిన్న చూపేనండి" పెదవి విరిచాడు.

"పాయింటే. మధ్య దళారులదే రాజ్యం అయిపోయింది. బియ్యం ఉప్పు పప్పు పాలూ పండ్లూ కాయగూరలు అన్నిటి ధరలూ ఆకాశాన్నంటుతున్నాయి. కాయగూరలు త్వరగా పాడవకుండా ఉండటానికీ, పండ్లు త్వరగా మగ్గటానికీ ఎన్నో విషపూరిత రసాయనాలు ఉపయోగిస్తున్నారుట. టీవీలో చూపించారు. అవి తింటే లేనిపోని రోగాలొస్తాయిట..."

"అలాంటి మాయలు ఏ రైతూ చేయడండి..."

"నేనూ ఒప్పుకుంటున్నాను. అందుకే ఆరుగాలం కష్టపడే రైతు అప్పుల పాలై ఆత్మహత్య చేసుకుంటున్నాడు. మధ్య దళారులు మేడలూ మిద్దెలూ కట్టేస్తున్నారు. కష్టం ఒకరిది భోగం ఇంకొకరిది!"

"బాగా సెప్పేరు..." అన్నాడు సుబ్బయ్య నా వంక అభిమానంగా చూస్తూ.

ఒక రోజున పేపర్లో వచ్చిన వార్త చూసి ఉలిక్కిపడ్డాను.

ఓ ఎమ్మెన్సీ సంస్థ కొబ్బరి బొండాం నీళ్ళని ప్యాక్ చేసి అమ్ముతుందట. అందుకు గాను వేలాది ఎకరాల్లోని కొబ్బరి చెట్లని లీజుకి తీసుకుంటుందిట. వారి ప్రాసెసింగ్ యూనిట్లకీ, అనుబంధ పరిశ్రమల స్థాపనకీ రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రపు విలువకి వంద ఎకరాల భూమిని కట్టబెడుతోందిట. పన్ను రాయితీలూ విద్యుత్ సబ్సిడీలు ఇవ్వబోతోందిట!

ఒకప్పుడు దాహమేస్తే సోడాలూ, నిమ్మసోడాలూ, నిమ్మకాయ పిండిన మజ్జిగా తాగే వాళ్ళం. అవి పోయి కూల్డ్రింకులొచ్చాయి. కొబ్బరి బొండాలూ అందుబాటులోకి వచ్చాయి. దానితో బాటు రకరకాల జ్యూస్‌లు మార్కెట్లో ప్రవేశించాయి.

ఇక ప్యాక్‌డ్ కొబ్బరి నీళ్ళొస్తే సుబ్బయ్యలాంటి వాళ్ళపని ఖాళీయే!

కడుపులో దేవింది. సుబ్బయ్యని తలచుకుని జాలిపడ్డాను.

"అలా ఉన్నారేం" అడిగింది నా భార్య.

వార్త వివరించాను.

"అవిప్పుడెక్కడ వస్తాయి లెండి..." అని తీసిపారేసింది.

కాని చిత్రంగా వేసవికి ముందే ప్రత్యక్షమై అమాంతం మార్కెట్టుని ముంచెత్తాయి.

సుబ్బయ్య కొబ్బరి బొండాల దుకాణం ప్రక్కనే పెద్ద హోర్డింగు వెలసింది.

దాని మీద కొబ్బరి చెట్టు, కొబ్బరి బొండాల ఫోటోలున్నాయి. ప్రక్కనే 'లేత కొబ్బరి నీళ్ళు. ఇవి తాజావి. స్వచ్ఛమైనవి. మాలిన్య రహితమైనవి. సంపూర్ణ ఆరోగ్యకరమైనవి' అని పెద్ద పెద్ద అక్షరాల్లో రాశారు!

ఆ బోర్డునే చూస్తూ నిలబడి కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు సుబ్బయ్య.

"ఇలాటివి ఎన్నో వస్తుంటాయి పోతుంటాయి. నిన్నేం దెబ్బ కొట్టవులే సుబ్బయ్యా. తాజా కొబ్బరి నీళ్ళతో ప్యాక్ చేసిన కొబ్బరి నీళ్ళు పోల్చలేం. నీ బొండాల డిమాండ్ తగ్గదు చూడు. అదీగాక వారికి ప్యాకింగ్ ఖర్చు అదనంగా ఉంటుంది గనుక రేటు ఎక్కువ పెడతారు" ధైర్యం చెప్పాను గాని నా మాటలు నాకే విచిత్రంగా అన్పించాయి.

"బొండాల రేటు రెట్టింపు చేశారండి. సరుకు దొరకట్లేదంట..." ఏడుపు స్వరంతో అన్నాడు.

"ఇప్పుడెంత రేటయ్యింది?"

"నలభై" దిగులుగా చెప్పేడు.

ఏం చెప్పాలో తెలీక సానుభూతిగా చూసి వచ్చేశాను.

ఆ మల్టీ నేషనల్ కంపెనీ తన ప్రచారాన్ని ఉధృతం చేసింది. పేపర్లలో టీవీల్లో ప్రకటనలతో ఊదరగొడుతోంది. ఓ ప్రముఖ సినీనటుడు "నేనిదే తాగుతాను. ఎంచేతంటే నాకు తాజాదనం కావాలి. సురక్షితమైనదై ఉండాలి. ఈ విషయాల్లో రాజీ పడను" అని యాడ్‌లో చెప్పాడు.

'ప్రస్తుతం కొన్ని సంస్థలు థెర్మల్ ప్రోసెస్ టెక్నాలజీ ద్వారా కొబ్బరిబొండాం నీటిని నిలువ ప్యాకింగ్ చేస్తున్నాయి. దాని వల్ల కొబ్బరి నీటి సువాసనే మారిపోతోంది. అందుకని మేం సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో లేలేత కొబ్బరి బొండాల నీటి తాజాదనం, సువాసన ఏ మాత్రం కోల్పోకుండా చక్కగా ప్యాకింగ్ చేస్తున్నాం. ఒకసారి తాగితే మీరూ ఇష్టపడతారు' అని ప్రకటనలు గుప్పించారు.

"ఇదేదో బాగా ఉన్నట్టుందండీ. ఇవాళ కొబ్బరి బొండాలు మానేసి ఈ రెడీమేడ్‌ది కొనుక్కురండి. మన ఆరోగ్యమూ చూసుకోవాలిగా!" అంది శ్రీమతి.

"వాళ్ళేదో చెబుతారు గాని కొబ్బరి బొండాం నీటినెవరూ కల్తీ చెయ్యలేరు. దానికన్నా సురక్షితమైనది లేదు తెలుసా?"

"ఏం చెబుతాం. తినే పండ్ల మీద కార్బైడ్లు చల్లి విషపూరితం చేసెయ్యడం లేదూ! పైగా వాళ్ళు కొబ్బరినీళ్ళలోని శరీరానికి హాని చేసే వేటినో తొలగిస్తున్నారట. వాళ్ళంత పబ్లిగ్గా చెబుతోంటే నమ్మకుండా ఎలా ఉంటాం?"

నా దగ్గర జవాబు లేదు.

అవాళ ప్యాక్‌డ్ కొబ్బరి నీళ్ళు కొన్నాను. 250 ఎమ్మెల్ ఒక్కోటీ 75 రూపాయలు. సుబ్బయ్య లీటరు కొబ్బరి నీళ్ళు 80 రూపాయలకే అమ్ముతున్నాడు!

సుబ్బయ్యని తప్పించుకుని తిరుగుతున్నాను. ఏదో తప్పు చేసిన భావన నన్ను అటువైపు వెళ్ళనీయడం లేదు.

అయినా అప్పుడప్పుడూ బాల్కనీలోంచి అతడి వ్యాపారాన్ని గమనిస్తూనే ఉన్నాను.

అతడి దగ్గర బొండాలు కొనేవాళ్ళ సంఖ్య తగ్గు ముఖం పట్టింది. అక్కడికీ 42 రూపాయలే అని అట్ట ముక్క మీద రాసి వేలాడదీశాడు కూడా.

మెల్లగా అతడి దగ్గరి బొండాల రాశులు చిక్కిపోసాగాయి.

ఒకసారి అనుకోకుండా సుబ్బయ్య ఎదురయ్యాడు. "ఏమోయ్ ఎలా ఉన్నావ్?"

"యాపారం బాగా లేదండి. మార్కెట్లోకి సరుకు రాక బాగా తగ్గి పోయిందండి..."

నాకు అర్థమవుతోంది. యమ్మెన్సీ అనకొండ నోరు తెరిచింది. రైతులూ చిల్లర వర్తకులూ అంతా దానికి ఆహారం కావాల్సిందే!

మరికొద్ది కాలానికే నా భయాలు నిజమయ్యాయి.

సుబ్బయ్య దుకాణం మాయమైంది!

ఇది జరిగిన ఆర్నెల్లకి అమెరికాలో ఉంటోన్న మా అబ్బాయికి గేటెడ్ కమ్యూనిటీలో అపార్ట్‌మెంట్ కొందామని తిరుగుతోంటే ఒక నిర్మాణం దగ్గర రాళ్ళు మోస్తూ కన్పించాడు సుబ్బయ్య.

నా కళ్ళల్లో కన్నీటి అల భళ్ళున బ్రద్ధలయింది!

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక - 17-11-2016)**